# నాకీ గుర్తింపు చాలదు

-పి. కామాక్షి

'అంశుమన్, ఐ.ఎ.యస్.,

"ఈ జిల్లాకు సబ్—కలెక్టర్ ఛార్జ్ తీసుకోబోతున్నాడీ రోజు ...." 'సేపలోడు' నుంచి 'అంశుమన్' స్థాయి వరకూ ఎదగ్గలిగాడంటే— అందమైన పేరొక్కటే కాదు. అందుకోలేనని భయపడ్డ 'ఆ' మూడక్షరాలకే-సొంతదారుడయ్యాడు.

ఎన్నో అడ్డంకులు మరెన్నో అపశృతులు — గుర్తొచ్చే గత స్మృతులు చిన్నప్పణ్ణించీ అంతే —

'రాజు' పేరంటే చచ్చేంతిష్టం తనకి. కానీ ఆ పేరే గాదు అసలు పేరే పెట్టలేదు తల్లితండ్రీ.

బెస్త కులంలో పుట్టాడన్నంత మాత్రాన 'సేపలోడా ...' అంటూ పిలుస్తూంటే ఎన్నిసార్లు ఏడ్చేవాడో ...

పోలేరమ్మ జాతర్రోజు పుట్టానని 'పోలేరయ్య' పేరెట్టాలని అమ్మా ...

వీల్లేదు ... ఆడికి 'పోతులయ్య' పేరట్టుకోవాల్సిందేనని అయ్య ...

గూడెం మొత్తం వాళ్ళ తగూలాటలో దూరేందుకు పోగ్గె ఓ 'తంతు'లా కాసేపు చోద్యం చూసి వెళ్ళేవాళ్ళే.

చివరికి ఏ పేరూ లేకుండానే పెద్దయ్యేవాణ్ణేమో —

పంతులయ్యొచ్చిండు ... సంబరంగా సెబ్తూన్న శీనూతో బాటు రేవు దగ్గరకు పరిగెట్టికెళ్ళాడు తను.

పడవలోంచి మాంఛి ఒడ్డూ పొడుగు బుర్ర మీసాలున్న ఆయన్ని సూడగానే ఝడుసుకుని పారిపోయి వచ్చాడక్కణ్ణించి.

మూణ్రోజులు అటు వైపెళ్తే ఒట్టు.

అంతకు ముందొచ్చిన రాజయ్య పంతులు చావబాదేవాడు.


అందుకే పంతుళ్ళంటే భయం వేసేది.

అమ్మ పలకా, బలపం చేతిలో పెట్టి నా వెంటే స్కూలు కొచ్చింది.

నేనెళ్ళనని సతాయించాను.

మొండిపట్టు పట్టి నాలుగు దెబ్బలేసి మరీ బళ్ళొ కూర్చోబెట్టింది.

బుర్ర మీసాలాయన, ఆయనకి ("రొయ్య మీసాలయ్య" అని రహస్యంగా ఓ పేరెట్టా).



మా క్లాసు గది చూపించేందుకు వచ్చిన రాజులయ్య ... నాకు 'పేరు' లేదని 'సేపలోడ'ని పిలుస్తారని అంటూంటే ఒళ్ళు మండిపోయింది.

వాడి బుర్ర పగలగొట్టాలనిపించిందా క్షణంలో —

* * *

ఆ బుర్ర మీసాలయ్య కూడా ఎక్కువ కాలం ఉండలేదు.

ఏడకో మార్చినారని ఈరిగాడు సెప్తే తెల్సింది ఎల్లిపేతున్నాడని.

సంబరపడ్డాను ఆ వార్త విని.

ఓ బెల్లం ముక్క పోలేరమ్మకు ప్రసాదంగా యిచ్చి వచ్చా.

ఈసారి ఏ పంతులయ్యొచ్చినా "ఇస్కూలు కాడికెళ్ళకూడదు"

అమ్మ సావగొట్టినా సరే 'ఎల్లనని' సెప్పేయాలి. గట్టిగా నిర్ణయించుకున్నా.

"నాకేం తెల్సు —నన్ను 'నన్ను'గా గుర్తించుకునేట్టు చేసే ఓ మహానుభావుడు రాబోతున్నాడని."

* * *

ఈల్లేదు ... ఆణ్ణి ఎట్టికంపను, బాగా సదివి ఆడు పెద్దోడయ్యాక ఓ పెద్ద ఉద్యోగంలో సేర్పించాల.

ఆ రాయుడి కాడ కాళ్ళట్టుకునే కర్మ ఈడేంటి నీక్కూడా వొద్దంతే.

.... అమ్మ ఏదో సెప్తోన్నా ...

అయ్య సావగొట్టిండు. పాపం ఓ మూల కూర్చొని ఏడుత్తూంటే నాక్కూ ఏడుపొచ్చేసింది.

అయ్య ఎప్పుడూ కొట్టలేదు. మరెందుకో ఈ రోజిట్టా జేసిండు ... నేనూ ఏడూస్తూంటే అమ్మ దగ్గరకి తీసుకుని కళ్ళు తుడుస్తూ అంది.

'ఏరా బాగా చదూకుంటావా? ఆ కరణం కొడుకు సూరిబాబు లేడూ. ఆ బాబులా సక్కంగా సదూకోవాల ...' పోలేరమ్మ గుడి కాడ ఎట్టుకున్న ఒట్టు గుర్తొచ్చింది.

అయినా ఏం మాట్టాడలేదు.

* * *

ఇస్కూలుకి శంకరం మాట్టారని కొత్తగా వచ్చిండు.

ఈ రోజు నువ్వూ ఎల్లాలి మరి ...

ఓ రోజు —

ఉదయాన్నే నన్ను ముస్తాబు చేసి చేతిలో పలక యిచ్చి చెప్పింది అమ్మ.

'ఎల్లనని ఎల్లాగబ్బా సెప్పేది' సూద్దాం ఈ పంతులయ్య కత ఎలా ఉందో ...

మేట్టార్ని నాకో పేరట్టమని అడిగేయాల.

ఉషారుగా బయల్దేరా.

'పోలేరమ్మ దగ్గరెట్టుకున్న 'ఒట్టు' ఈసారి కొగ్గేయమని గుడికాడ మొక్కొని ఎల్లాలని" అనుకుంటూ.

ఏం పేరు నీ పేరు?
'సేపలోడండి ...' కిసుక్కున నవ్వుతూ సెప్పాడు ఆ శీనుగాడు.
ఈ పంతులయ్యా నవ్వుతాడేమో —
తలెత్తి ఆయన వంకే సూటిగా సూత్తూ నిల్చున్నా
ఊహు!... నవ్వలేదు.
ఏం పేరు పెట్టాలబ్బా ఈయన్కి ....
పిలకుంటే "పిలకలయ్య" అని పెట్టొచ్చు.
అసలా పిలకే లేదు.
"తప్పు అలా నవ్వకూడదు ... వీడికేం రాజా లా ఉన్నాడు


పేరు కావావలంటే నేనే పెడ్తాలే ..."
శీనూ వంక తిక్క కుదిరిందన్నట్టుగా ఐఓ సూపు ఇసిరి మళ్లీ పంతులయ్యా కేసి చూశా ...
ఆయనేదో సెప్పబోయే లోపల —
బెల్లు మోగింది. అంతే
పలక చేత్తో పట్టుకుని బైటకి పరిగెట్టా
'పంతులయ్య నాకో పేరెట్టాలని అనుకుంటు న్నాడంట"
ఇంటి దగ్గర గర్వంగా చెప్పాను. అమ్మకీ, అయ్యకీ.

* * *

'ఊహు! నువ్వూ రావాలంతే ... శంకరం మేట్టారు నిన్నూ పిల్సుకు రమ్మని సెప్పారు నాకు ..." అమ్మ మెడ చుట్టూ చేతులేసి అడిగా గారంగా ...
అట్టాగేలే ... ముందీ బువ్వదిను. అయ్యా, నేనూ, నువ్వూ ఎల్దాం ... రోజూ శంకరం మేట్టారు దగ్గరే సదూకుని రేతిరికి యింటికి వస్తూంటంతో
అయ్య తాగి వస్తున్నాడన్న విషయం తెల్దు.
బువ్వ తింటూంటే —
అయ్య వచ్చి నా సెయ్యెట్టుకుని ఈడ్చుకుంటూ బైటకొచ్చిండు.
అడ్డమొచ్చిన అమ్మని కాల్తో నెట్టేసి కొప్పట్టుకుని దూరంగా తోసిండు. ఎల్లి దూరంగా పడింది అమ్మ.
నన్నెవరి కాడికో పంపిస్తడని అప్పుడప్పుడూ అమ్మ సెబ్తుండేది.
అంటే —ఆ 'రాయుడి' దగ్గరికేనన్నమాట.
అమ్మో! ఆ రాచ్చసుడు సచ్చేట్టు చావగొడ్తుంటాడు.
అస్తమాను 'పని' సేయమని సంపుకు తింటాడు.
అమ్మ కతల్లో సెప్పినట్టు ఆ యములాడు ఈడేనేమో ....

* * *

కళ్ళు తెరిసి సూత్తే —,
'సుట్టూ సిమ్మ సీకటి' గుయ్యిమంటూ అవేటో అరుత్తున్నాయి.



ఒకడు : నీవు మూడు రకాల కళ్ల జోళ్లు ఎందుకు వాడుతున్నావు?
ఇంకోడు : ఒకటి దగ్గర చూపుకు, ఇంకోటి దూరపు చూపుకు, మూడవది ఈ రెండూ వెతకడానికి.
— కె. రామారావు, హైదరాబాద్

ఆకలేసింది ...
పక్కకి తిరిగి సూత్తే అయ్య లేడు.
ఎక్కడ దాపెట్టినాడో ఏటో నన్ను.
భయం మనిపించి గట్టిగా కళ్లు మూసుకున్నా.
"నీకేం భయం లేదు. ఎల్లిపోదాం దా" ...
అమ్మ గొంతు విన్పించింది.
సంతోషంతో చీకట్లోనే తడుముకుంటూ —
అమ్మ చెయ్యి పట్టుకుని లేచాడు.
సూడు ... 'పంతులయ్యా కాడకెల్లి ఇవరం సెప్పి నిన్ను పట్నం పంపిత్తా. అక్కడే ఉండి బాగా సదూకోవాల'.
మేట్టారు సెప్పినట్టే సెయ్యాల ...
"ఎప్పుటూ ఏడవకుండా ఉండాల. అమ్మని మాత్రం మర్సిపోకేం పట్నంలో సదువయ్యాక ఇంకో పెద్ద పట్నం ఎల్లి సదివించుకుంటానని మేట్టారయ్య అంటే అట్నించటే ఎల్లు ... మళ్లీ ఇక్కడికి రామాక ... సరేనా!"
పట్నం ఎల్లిపోవాలంటే అమ్మని కూడా వదిలి పెట్టిపోవాలి.
ఛీ ఛీ ... అయ్య వల్లే ఇదంతా జరిగింది.
కోపంగా, కసిగా తిట్టుకున్నా ....

* * *

నా కోసం —
మాష్టారు చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చెయ్యాల్సి వచ్చింది.
ఆ మహానుభావుడే —
స్కూల్లో చేర్పించేప్పుడు 'అంశుమన్' అన్న పేరు రాయించింది మొదట్లో —
ఆ పేరు నోరు తిరక్క 'అసుమన్' 'ఆసుమను' అని అంటూంటే
మాష్టారు గట్టిగా నవ్వేసి, 'అంశుమన్' అని పలకాలంటూ ఎన్నోసార్లు ప్రయత్నించేవాడు.
కాలేజ్ చదువు పూర్తయ్యాక —
సొంతంగా స్కాలర్‌షిప్ తెచ్చుకుని చదువుకోవాల్సి వచ్చింది.
మేష్టారి ఆరోగ్యం దెబ్బతిని మరణించగానే దిక్కులేని వాడయ్యాడు తను.
చదువును మధ్యలోనే ఆపేసి ఇంటికి తిరిగి వెళ్ళిపోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించాడు.

కానీ —మాష్టారికిచ్చిన 'మాట' కోసం బలవంతంగా ఉండిపోక తప్పలేదు.
చాలామంది 'అంశుమన్' అర్థమేమిటని ప్రశ్నించారు ఎన్నోసార్లు.
అసలా పదానికి అర్థం.తెలిస్తేగా?
సంస్కృత భాషలో దిట్ట అన్పించుకున్న మాష్టారు కూడా ఎప్పుడూ ఆ పదం అర్థమేమిటో విడమరచి చెప్పలేదు.
ఇన్నాళ్ళకి —
మాష్టారి కోరిక ప్రకారం నేను ఉన్నత పదవికి చేరుకున్నా.

* * *

నాకీ గుర్తింపు చాలదు.
ఔను. నేనింకా గుర్తింపు పొందాలంటే ఎన్నో పన్లు చేయాలి. నాకై నేను ఓ చట్రంలో చుట్టుకున్న కమ్మీల్లా ఎటువంటి అధికారం లేకుండా ఉండకూడదు.
నేనా రాయుడి చెర నుంచి అర్ధరాత్రి పూటే స్వేచ్ఛగా బైట పడగలిగాను.
మన దేశానికి వచ్చిన 'స్వతంత్రం'లా దొంగలా పారిపోవాల్సి వచ్చినదీ ఈ 'అర్ధరాత్రి' పూటే.
అందుకే నాకూ అధికారయుత 'స్వేచ్ఛ' కావాలి.
నెనెవ్వరికీ లెంగిపోకుండా ఉండాలంటే నాకో 'అధికార'మనే ఆయుధం కావాలి.
మాష్టారు చెప్పినట్టుగా —
'మంచి'కి నువ్వు దాసోహమైనా ఫర్లేదు
'చెడు'కు మాత్రం దాసుడిగా మారకు.
ఆ లొంగుబాటే —
మన్ని గుర్తింపు లేకుండా చేస్తుంది. ఆ పొరబాటుకు 'జీవితం' బలిచ్చినా దిద్దుకునే 'అవకాశాన్ని' మాత్రం ఎప్పుడూ అది నీకివ్వదు.

* * *

ఈ 'అక్షరాలు' నేర్చుకునే రాయుడి గర్వం పెరిగింది.
ఈ 'అక్షరాలు' చూసుకునే మాష్టారు 'దైవం'లా కాపాడింది.
అందుకే —
ఈ అక్షరాల్ని గూడెంలో అందరికీ పంచి పెట్టాలి.
ఈ అక్షరాల్ని గుండెల్లో పెట్టుకుని పూజ చెయ్యాలి. నాకీ గుర్తింపు చాలదందుకే —
కొంతకాలం వరకూ వేచి ఉంటేనే ఆ గుర్తింపు అధికారికంగా స్వేచ్ఛాపూర్వకంగా నాకు వస్తుంది.
అంత వరకూ —
ఈ గూడెంలో నేనో 'సేపలోణ్ణి' మాత్రమే.
ఈ రోజే బయల్దేరాలి 'మందీ మార్బలాల్ని' తోసి రాజని ఒంటరిగా ....
నా కోసం ఎదురు చూస్తున్న అమ్మకోసం. అయ్యకోసం.